# డా॥ విప్పర్తి ప్రణవమూర్తి

## 'చిరిగిన నోటులో చెరగని జ్ఞాపకం'

"మనిషి అన్న తరువాత మడికట్టుకు కూర్చోనవసరం లేదు. అవకాశం వచ్చినప్పుడు అనుభవించాలి" ఇటు వంటి సత్యాల్ని స్వంత అల్లుడికే చెపుతూ ఉంటాడు రావుగారు. ఏభై ఏళ్ళు దాటినా రావుగారు అన్నిటికి తయారే! హుషారైన మనిషి.

అల్లుడు శరత్‌బాబు స్వయం కృషిపై అంతర్జాతీయ బాంకింగ్ మీద పరిశోధన చేయడం వలన, బ్యాంకు వారే స్వంత ఖర్చుల మీద ట్రైనింగ్ కోసం ఇంగ్లాండు పంపించారు. రెండేళ్ళలో తిరిగి వచ్చిన బాబుకి బొంబాయి బ్యాంకులో పెద్ద ఉద్యోగ మిచ్చారు. అన్ని మెళుకువలూ తెలిసిన బాబు ఆ ఉద్యోగాన్ని సమర్థవంతంగా చేసుకొస్తూ ఉన్నాడు. అటు అధికార్ల, ఇటు ఖాతాదార్ల మన్నల్ని పొందుతున్నాడు.

ఆ రోజు నథమల్లాల్ భూల్‌చంద్ "రేపు సాయంత్రం బ్లూ మౌంటెన్‌లో ఆన్నీడాల్స్ ప్రోగ్రాము ఉన్నది బాబూ. మీకి తప్పక వెళ్ళాలి" అంటూ రెండు వందల రూపాయల రెండు కాంప్లిమెంటరీ టిక్కెట్లను చేతిలో పెట్టినప్పుడు బాబు హృదయం ఉప్పొంగి పోయింది.

ఆన్నీ డాల్స్ ప్రఖ్యాత పాప్ సింగరు. ఆవిడ పేరు వినని రసికుడుండడు. గత అయిదు సంవత్సరాలుగా 'ఆన్నీ' కార్యక్రమాలు టీ.వి.లలో ఎన్నో వచ్చాయి. అన్ని పత్రికల్లోనూ ఈవిడి గురించి ప్రశంసలే!

ఈ విధంగా సంపాదించిన టిక్కెట్లను ఆరోజే పనిమీద బొంబాయి వచ్చిన తన మామగారైన రావుగారిచేతిలో పెట్టాడు బాబు. మరుసటి రోజు సాయంకాలం ఇద్దరూ కొత్త పెళ్ళికొడుకుల్లా తయారై రహస్యంగా బ్లూమౌంటెన్ హోటల్‌కు బయలు దేరారు స్కూటరు మీద.

హోటలు దగ్గిర వందల కార్లు, స్కూటర్లతో అపరిమితమైన జన సందోహంతో కోలాహలంగా ఉన్నది. పోలీసు బందోబస్తు కూడా ఎక్కువగానే ఉన్నది.

మనుష్యులను తోసుకుంటూ ముందుకు పోయారు బాబూ, రావుగారూను.

"మనది రెండు వందల రూపాయల టిక్కెట్టు కదూ బాబు" ముందు కుర్చీలో కూర్చోపెడతారనే ఉద్దేశంతో అన్నాడు రావుగారు.

"అవును" అన్నాడు బాబు.

"మీ టిక్కెట్టు ఏది?" ముందు కొచ్చేస్తున్న వాళ్ళను ఆపి అడిగాడు ఒక వాలంటీరు.

ఆ టిక్కెట్లను చూసి మెడ పట్టి గెంటినంత పని చేశాడు వెనక్కి పొమ్మంటూ. వాడి భాషలో చెప్పుకు పోతూ ఉంటే, రావుగార్కి అర్థమైనది ఏమిటంటే... ముందు ఒక టిక్కెట్టును పదివేల రూపాయలు పెట్టి కొనుక్కున్న వాళ్ళున్నారు. మీ దగ్గరున్నది అతిసామాన్యమైన రెండు వందల రూపాయల టిక్కెట్లు. ఈ టిక్కెట్లు వారు అందరికంటే ఆఖరున నుంచుని చూడాలి అవి.

అహం దెబ్బతిన్నా, చుట్టూచూసి, తెలిసిన వారెవరూ లేరని తృప్తి పడి వెనుక వరసలలోనే నిలబడి సర్దుకుపోయారు.

హాలులో ఇసుక వేస్తే రాలనంత జనం చేరిపోయారు. చుట్టూ రంగు రంగుల సీరియల్ సెట్ లైట్లు వెలుగుతూ ఆరిపోతూ, దూరంగా వినిపిస్తున్న వాయిద్యాలకు లయ కలుపుతున్నట్లున్నాయి.

హఠాత్తుగా హాలులో ఉన్న లైట్లన్నీ ఆరిపోయాయి. స్టేజి మీద ఉరుములు మెరుపులు కనిపించాయి. జనం అంతా నిశ్శబ్దం అయిపోయారు. స్టేజి మీద రంగు రంగులైట్లను అటూ ఇటూ త్రిప్పడం ప్రారంభించారు ఎన్నోరకాల వాయిద్యాల్ని యుద్ధానికి వెళ్ళేటప్పుడు రణభేరి మ్రోగించినట్లు బాది ఒక్కసారి ఆపేశారు.

ఇంతలో సూటూ బూటూ వేసుకున్న యాభై ఏళ్ళ వ్యక్తి, మైకు ముందు నిలబడి "ఆన్నీ డాల్స్" ఎటువంటి పాటగత్తె ఆవిడ ఎన్నెన్ని దేశాలలో ఎన్నెన్ని ప్రదర్శనలిచ్చింది. ఎన్నెన్ని రికార్డులను బద్దలు కొట్టింది వివరిస్తూ అనర్గళంగా ఉపన్యాసమిచ్చాడు.

ఇదిగో మీ 'ఆన్నీ' అంటూ వంగుని అతను నిష్క్రమిస్తూ ఉంటే, జిగేల్ మంటూ మెరుపు తీగ స్టేజిమీదకు ఉరికింది. చింపిరి జుట్టుతో, పిల్లికళ్ళతో, తెల్లని పాలవంటి శరీరచ్ఛాయతో నాజూకైన అవయవసౌష్టవంతో, వల్ల మాలిన శృంగారం చేష్టలతో అత్యంత ఆకర్షణీయంగా ఉన్నది ఆన్నీ. ఉన్నవో లేవో అన్నట్లు వేసుకున్న జీన్సు దేహానికి పూర్తిగా అంటుకుపోయాయి. కటి వలయం దగ్గర మాత్రం సిగ్గు బిళ్ళ నొకదానిని వేలాడ గట్టింది.

"ఆన్నీ డాల్స్" అంటూ నమస్కారం సూచికంగా చేతులు ఎత్తింది జనంలో హర్షధ్వనులు మార్మోగాయి.

చెవులు గళ్ళు పడేటట్లు డమ్మూలూ, బాకాలూ ఒక్కసారిగా మ్రోగాయి.

అదే విధంగా విచిత్ర వేష ధారణలతో, సిగ్గు పడకుండా, వంతపాడేందుకు, గంతులేస్తూ మరో పది మంది అమ్మాయిలు, స్టేజి మీదకు చేరారు.

ప్రతి పాటకూ ముందు కొంచెము ఉపోద్ఘాతమిస్తూ పాట తరువాత పాట... వాళ్ళ




పాటలు పాడే సరికి, శ్రోతలంతా పాకావ పడ్డారు. వీరు కూడా గళమెత్తి పాడుతూ, తప్పట్లు, తాళాలతో, పాటల్లో లీనమై పోయారు.

ఏదో క్రొత్త ప్రపంచం అంచుల్లోకి వెళ్ళిపోయినట్లనిపించింది బాబుకి, రావుగార్కి కూడా.

హఠాత్తుగా జనంలో పాటకి బదులు ఏదో కోలాహలం వినిపించింది.

''ఏమిటి బాబూ'' అంటున్న రావుగారి మీదకి కూడా కొన్ని కాగితాలు పడ్డాయి. వీటిని ఏరు కోవటం తోనే జనంలో బయలు దేరింది అలజడి.

ఒక కాగితం రావుగార్కి దొరికింది ''చూడు బాబూ'' అంటూ ఇచ్చిన కాగితాన్ని, అసలే బ్యాంకు ఉద్యోగి బాబు క్రీనీడలో కూడా ''అసలైన పదిరూపాయలు, మామగారు నకిలీదికాదు'' కనిపెట్టేశాడు. అలా అంటూ ఉండగానే ఇద్దరి వడ్డిల మీద లాఠీదెబ్బలు, ధారావాహికంగా పడిపోయాయి. జనాన్ని గొర్లని బాదినట్లు బాదారు పోలీసులు. ఆతురతతో బైటకు పరిగెట్టే మనుషులతో మరింత త్రొక్కిసలాటై పోయింది.

ఎవడో అభిమాని పది రూపాయల నోట్లను, ఉత్సాహమాపు కోలేక, గుప్పెట్ల కొద్దీ ఆన్నీ దాల్సి మీద, మరి కొన్నింటని జనాల మీదికి కూడా విసిరాడట. అదీ ఆ గడిబిడకు కారణం.

రావుగారూ బాబూ ఈ కుమ్ములాటలో విడిపోయారు. ఇద్దరి కళ్ళ జోళ్ళూ ఎక్కడో పడిపోయాయి. ఇద్దరి చొక్కాలు చిరిగి పోయాయి. ఒళ్ళు హూనమైపోయింది. వీరిద్దరూ స్కూటరు దగ్గర తిరిగి కలిసికొనేందుకు రెండు గంటలు పట్టింది.

''మామగారూ నాకళ్ళజోడు పడిపోయింది. చీకట్లో తడిమితే ఎవడిదో నాకు దొరికింది'' చూపించాడు బాబు మామగారికి.

''నాకూ అంతేనోయ్. నాకూ మరెవరిదో కళ్ళజోడు దొరికింది'' ఆయనా చూపించాడు అల్లుడికి.

అదృష్టం కొద్దీ, విచిత్రంగా మామకళ్ళజోడు బాబుకీ, బాబు కళ్ళజోడు మామకీ దొరికాయి. సంతోషించారిద్దరూ. రావుగార్కి ఒక పదిరూపాయల నోటు కూడా దక్కింది.

జాగ్రత్తగా ఇంటికి చేరి, ఇంట్లో మాత్రం తమ స్కూటరు రోడ్డు మీద ఎలా 'స్కిడ్' అయిందో ఇద్దరూ ఎలా పడిపోయారో, జంటగా కథ అల్లి చెప్పారు.

ఈ సంఘటన జరిగి అయిదు సంవత్సరాలు పైగా అయి పోయింది.

ఎన్ని సార్లు సర్పుతీసినా నలిగి ఒక మూల కొంచెము చిరిగిన ఆ పదిరూపాయల నోటు కనిపిస్తే రావుగారి పెదవుల మీదకి బుల్లి చిరునవ్వు వస్తుంది. వెంటనే వీపును కూడా ఒకసారి తడుముకుంటారు.

ఆ నోటును మాత్రం ఆయన ఖర్చు చేయరు. దాచుకున్నారు జ్ఞాపకార్థంగా.

□□